నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, సోమవారం 18 నవంబర్ 2024 VIKARABAD




ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని ఓ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

# సజావుగా గ్రూప్-3 పరీక్షలు

**నిర్ణీత సమయానికే హాజరైన అభ్యర్థులు**

**పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు**

**రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 60 శాతం మంది అభ్యర్థులు హాజరు**



వికారాబాద్ పట్టణంలో..



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన పరీక్షలకు అభ్యర్థులను నిర్ణీత సమయంలోనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించి, తర్వాత గేట్లు మూసేశారు. రంగారెడ్డి జిల్లాలో 56,394 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 60 శాతం మాత్రమే పరీక్షలు రాశారు. తట్టిఅన్నారంలోని శ్రేయస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషనల్ అకాడమీతోపాటు పలు పరీక్షా కేంద్రాలను రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో 20 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 10,196 మంది ఎగ్జామ్స్ రాయాల్సి ఉండగా 60 శాతం మంది మాత్రమే హాజరయ్యారు. వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఎస్‌ఏపీ కళాశాలతోపాటు పలు కేంద్రాలను, ఎస్పీ నారాయణరెడ్డి వికారాబాద్ సిద్ధార్థ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించడంతోపాటు జిరాక్స్ సెంటర్లను మూసి వేయించారు. కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను అనుమతించలేదు.

- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ

4లో..



వికారాబాద్ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



*వికారాబాద్ జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నత్తనడకన సాగుతున్నది. సర్వే ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కాగా ఆదివారం సాయంత్రం వరకు జిల్లాలోని 2,77,977 కుటుంబాల్లో.. 1,45,414 ఫ్యామిలీ(సుమారు 52%)లు పూర్తి కాగా.. ఇంకా 1,32,563 కుటుంబాల సర్వే పూర్తి కావాల్సి ఉన్నది. ప్రభుత్వం ప్రకటించిన గడువు నేటి సాయంత్రంతో ముగియనుండగా.. ఒక రోజులో మిగతా 48 శాతం కుటుంబాల సర్వే పూర్తవుతుందా..? అన్న సందేహం నెలకొన్నది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం సర్వే గడువు తేదీని పొడిగించినట్లు అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు.*

*- పరిగి, నవంబర్ 17*



పరిగి మండలంలోని గడిసింగాపూర్‌లో సర్వే జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో కరీం(ఫైల్)

# సర్వే సగమే..

## మిగిలింది..ఒక్క రోజే..

**వికారాబాద్ జిల్లాలో 52 శాతం మాత్రమే సర్వే పూర్తి**

**ప్రారంభంలో హడావిడి.. క్రమేణా నత్తనడకన..**

**నేటితో గడువు పూర్తి.. సమయాన్ని పొడిగించని సర్కార్**

**వికారాబాద్ జిల్లాలో 277977 కుటుంబాలు**

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో ఈ నెల 6వ తేదీ నుంచి సర్వే ప్రారంభమైంది. మూడు రోజులపాటు కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లు వేయగా 9వ తేదీ నుంచి సర్వే షురూ కాగా.. సోమవారం వరకు పూర్తి చేయాలని అధికా రులు సూచించారు. జిల్లాలో మొత్తం 2,63,362 కుటుంబాలు ఉన్నట్లు మొదట అధికారులు పేర్కొనగా ప్రస్తుతం 2,77,977 కుటుంబాలున్నట్లు తేల్చారు. కాగా జిల్లాలో సర్వే చేపట్టేందుకు అధికారులు 2,024 మంది ఎన్యూమరేటర్లు, 208 మంది సూపర్‌వైజర్లను నియమించారు. తొమ్మిది రోజుల్లో ఎన్యూమరేటర్లు 52% సర్వేనే పూర్తి చేశారు.

### అధికారికంగా ఒకరోజే సమయం..

సమగ్ర కుటుంబ సర్వేపై ప్రభుత్వం మొదట ఎంతో హడావుడి చేసింది. ఇందులో ఇచ్చిన ప్రశ్నలపై అనేక సందేహాలుండడం, సర్వేకు అధిక సమయం పడుతుండడం తదితర కారణాలతో నత్తనడకన కొనసాగుతుందని చెప్పొచ్చు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ప్రకారం ఈ నెల 18వ తేదీ సాయంత్రం లోపు పూర్తి కావాలి. ఈ విషయాన్ని అధికారులు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు కూడా చెప్పారు. కానీ ఇప్పటివరకు జిల్లాలో 52% కుటుంబాల సర్వేనే పూర్తైంది. ఈ సర్వేకు ప్రభుత్వం పది రోజుల సమయం ఇవ్వగా తొమ్మిది రోజుల్లో సగమే పూర్తి కాగా.. మిగతా సగం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. అదే విధంగా సర్వే గడువు తేదీని పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాలేదు. కానీ, కొందరు జిల్లా స్థాయి అధికారులు ఈ నెల 22వ తేదీ వరకు చేపట్టవచ్చునని పేర్కొంటుండడం గమనార్హం. అయినప్పటికీ 22వ తేదీ వరకైనా పూర్తవుతుందా అంటే సందేహమే వ్యక్తమవుతున్నది. సర్వేకు మరో పది రోజుల సమయం ఇస్తేనే పూర్తవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### 20వ తేదీ తర్వాతే ఆన్‌లైన్‌లో నమోదు...

ప్రతిరోజూ సర్వే పూర్తైన తర్వాత మెటీరియల్‌ను సూపర్‌వైజర్ల ద్వారా మండల పరిషత్, మున్సిపాలిటీ కార్యాలయాలకు చేరవేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. అందుకు అనుగుణంగా ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కనీసం వెబ్‌సైట్ కూడా ఇవ్వకపోవడంతో సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసే ప్రక్రియ ప్రారంభమే కాలేదు. ఈ నెల 20వ తేదీ తర్వాతే వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### మున్సిపాలిటీల్లో..

| మున్సిపాలిటీ | శాతాల్లో |
|---|---|
| తాండూరు | 9622(48శాతం) |
| వికారాబాద్ | 9267(60శాతం) |
| కొడంగల్ | 2222(60శాతం) |
| పరిగి | 3189(61శాతం) |

**ఈ నాలుగు మున్సిపాలిటీల్లో 44,389 కుటుంబాలుండగా ఆదివారం సాయంత్రానికి 24,300(55శాతం) కుటుంబాల సర్వే జరిగింది. జిల్లాలో 2,77,977 కుటుంబాలుండగా ఆదివారం సాయంత్రానికి 1,45,414 (52శాతం) కుటుంబాల సర్వే పూర్తి కాగా 1,32,563 కుటుంబాల సర్వే చేపట్టాల్సి ఉందని అధికారులు వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి.**

| మండలం | శాతాల్లో.. |
|---|---|
| దోమ | 5909(42శాతం) |
| యాలాల | 5801(45శాతం) |
| దౌల్తాబాద్ | 5921(46శాతం) |
| చౌడాపూర్ | 3828(47శాతం) |
| కొడంగల్ | 5770(47శాతం) |
| బంట్వారం | 2760(48శాతం) |
| పెద్దేముల్ | 7029(49శాతం) |
| పూడూరు | 7058(50శాతం) |
| మోమిన్‌పేట | 6672(50శాతం) |
| కులకచర్ల | 6588(51శాతం) |
| దుద్యాల | 2457(52శాతం) |
| వికారాబాద్ | 4712(52శాతం) |
| పరిగి | 7076(53శాతం) |
| బషీరాబాద్ | 7216(55శాతం) |
| తాండూరు | 8078(55శాతం) |
| మర్పల్లి | 8123(56శాతం) |
| కోట్‌పల్లి | 4371(57శాతం) |
| నవాబుపేట | 7159(58శాతం) |
| ధారూరు | 7663(62శాతం) |
| బొంరాస్‌పేట | 6923(64శాతం) |

**జిల్లాలోని 20 మండలాల్లో 2,33,588 కుటుంబాలకుగాను 1,21,114 (52 శాతం) కుటుంబాల సర్వే జరిగింది.**

# ఫార్మా కారుమేఘాలు

# వీడేదెప్పుడో..

**మనస్సుకు ప్రశాంతత ఎప్పడోనని హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండా ప్రజల ఆందోళన**

**భూములిచ్చేది లేదని చెబుతున్నా.. వదలని కాంగ్రెస్ సర్కార్**

**న్యాయం చేయాలని ఫార్మా బాధితుల వేడుకోలు**

కొడంగల్, నవంబర్ 17 : ఫార్మా చీకట్లు ఎప్పుడు వీడుతాయో.. మళ్లీ ప్రశాంతంగా జీవించే పరిస్థితులు ఎప్పుడు వస్తాయోనని దుద్యాల మండలంలోని ప్రజలు, రైతులు ఎదురు చూస్తున్నారు. ఫార్మా ఘటనతో జరిగిన దమనకాండతో హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లోని ప్రజలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ఘటన ఎదురవుతుందోనన్న భయంతో జీవిస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత వెళ్లిన యువకులు, రైతులు ఇంకా ఇండ్లకు తిరిగి రాలేదు. ఫార్మా విలేజ్‌కు తాము భూములిచ్చేది లేదని గత పది నెలలుగా ధర్నాలు, రాస్తారోకోలు, రిలే దీక్షలతో స్పష్టం చేస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సర్వేలు, అధికారులతో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభలు నిర్వహి స్తుండడంతో విసిగిపోయి అధికారులకు ఎదురుతిరిగినట్లు వారు పేర్కొంటున్నారు. తాతల కాలం నుంచి భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని.. ఆ పొలాలే తమకు జీవనాధారమని.. అవి లేకుంటే తమ బతుకులు శూన్యమని స్పష్టం చేస్తున్నారు. 252 సర్వేనంబర్‌లో దాదాపు 300 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంటే, అందులో 500 మందికి పైగా పట్టాలు ఉన్నట్లు తెలిపారు. తమ పట్టా భూములను ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నారు. ఈ నెల 11న దుద్యాల, హకీంపేట గ్రామాల మధ్య అధికారులు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ మీటింగ్‌లో పోలీసులు భద్రతాచర్యలు తీసుకుని ఉంటే ఘటన ఈ విధంగా జరిగేది కాదని అధికారులు, ప్రజలు, రైతులం ప్రశాంతంగా ఉండే వారని పేర్కొంటున్నారు. కాగా, తమకు న్యాయం చేయాలని ఫార్మా భూ బాధిత రైతుల కుటుంబాలు ఢిల్లీకి వెళ్లాయి. జాతీయ ఎస్సీ, ఎస్టీ, జాతీయ మానవ హక్కుల కమిషన్లకు సీఎం రేవంత్‌పై ఫిర్యాదు చేయనున్నారు. అదేవిధంగా అన్ని వర్గాల మద్దతును కూడగట్టుకుంటున్నాయి. లగచర్ల ఘటనపై అడిషనల్ డీజీ (లాఅండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.



లగచెర్ల ఘటనా స్థలంలో కనిపించని పోలీసులు.(ఫైల్ )

### బందోబస్తు ఉంటే ఘటన జరిగేదే కాదు..



ఫార్మా కంపెనీల ఏర్పాటును రైతులు ప్రారంభం నుంచే వ్యతిరేకిస్తున్నారు. అధికారులు నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాల్లో తాము భూములను ఇచ్చేది లేదని తేల్చి చెబుతూనే ఉన్నారు. ఏ చిన్న ఘటన జరిగినా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. కానీ, ఈ నెల 11న జరిగిన ఘటనా స్థలంలో పోలీసులు ఎందుకు లేరు. ఇంటెలిజెన్స్ ముందస్తు సమాచారం తప్పకుండా ఉంటుంది. అది కూడా సీఎం సెగ్మెంట్ కాబట్టి గట్టి బందోబస్తు, నిఘా ఉంటుంది. కానీ ఆ రోజు భద్రతా యంత్రాంగం లేకపోవడానికి కారణమేంటి..? ఘటన జరిగిన తర్వాత పోలీసులు చేరుకోవడంలో ఆంతర్యమేమిటి..? పోలీసుల వైఫల్యాన్ని బీఆర్‌ఎస్ పార్టీపై రుద్దడం ఎంత వరకు సమంజసం. ప్రజా సంక్షేమానికి కృషి చేసే మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడం అమానుషం.

–అబ్దుల్ వాహబ్, రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు, బొంరాస్‌పేట

### మాజీ ఎమ్మెల్యేను విడుదల చేయాలి..



ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా మాజీ ఎమ్మెల్యే ప్రజలకు అండగా నిలవడం తప్పా..? ప్రభుత్వమే సక్రమంగా వ్యవహరిస్తే ప్రతిపక్ష పార్టీ నాయకులు ఎందుకు ముందుకొస్తారు. పోలీసులు భద్రతా చర్యలు తీసుకుని ఉంటే అంత రగడ జరిగేదే కాదు. అభం, శుభం తెలియని రైతులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి జైలుపాలు చేయడం అమానుషం. అక్రమంగా అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యేను బేషరతుగా విడుదల చేయాలి.

– భీములు, కొడంగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాటూర్. దౌల్తాబాద్



దాడి అనంతరం కడా ప్రత్యేకాధికారిని చుట్టుముట్టిన ప్రత్యేక బలగాలు..(ఫైల్)

# పింఛన్ల కోసం రణం

**నేడు కలెక్టరేట్ల ఎదుట పింఛన్‌దారుల నిరసన**

**హామీ ఇచ్చి ఏడాది గడిచినా.. ఇంకా పెంచకపోవడంతో ఆందోళనకు సిద్ధమైన పండుటాకులు, దివ్యాంగులు**

**రంగారెడ్డి జిల్లాలో 2,08,344 మంది పింఛన్‌దారులు**



రంగారెడ్డి, నవంబర్ 17 : పింఛన్ల పెంపు కోసం వృద్ధులు, దివ్యాంగులు ఆందోళనకు సిద్ధమయ్యారు. నేడు కలెక్టరేట్ల ఎదుట నిరసన తెలపాలని నిర్ణయించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.. 11 నెలలు దాటినా ఇంకా పెంచకపోవడంతో రేవంత్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితితోపాటు పలు పింఛన్‌దారుల సంఘాల ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నం 12 గంటలకు నిరసన తోపాటు రిలే దీక్షలు చేపట్టాలని నిర్ణయించారు. దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం నుంచి ఈ నెల 23 వరకు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

### జిల్లాలో 2,08,344 మందిపింఛన్‌దారులు

జిల్లాలో 2,08,344 మంది పింఛన్‌దారులున్నారు. వారిలో వృద్ధులు 84,836 మంది, దివ్యాంగులు 28,087, వితంతువులు 85,569, నేత కార్మికులు 848, పైలేరియా రోగులు 62తోపాటు గీత కార్మికులు, ఇతరత్రా పింఛన్‌దారులు ఉన్నారు.

### పింఛన్లు పెంచే వరకు పోరాటం ఆగదు



అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి. దివ్యాంగులకు రూ.4016 నుంచి రూ.6,000 వితంతువులు, ఇతర చేయూత పింఛన్ల వారికి రూ. 2016 నుంచి రూ.4,000, కండరాల క్షీణత వారికి రూ.15,000 ప్రతినెలా 5వ తేదీలోగా చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో నేటి నుంచి ఈ నెల 23వ తేదీ వరకు రిలే దీక్షలు చేపడుతున్నాం. పింఛన్లను పెంచే వరకు మా పోరాటం ఆగదు.

–కాళ్లె జంగయ్య, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు